# బతుకుబండి

- దేవి యాదగిరి

క్రైమ్ కథల పోటీలో
ప్రత్యేక సంచిక కోసం
ఎంపిక చేయబడిన కథ



**అ**ది మార్గశిర మాసంలో ఒక రోజు. ప్రాగ్దిశలో మందంగా విచ్చుకొంటున్న వెలుగు రేఖలను ధరణీతలంపై ఏటవాలుగా ప్రసరిస్తున్న ఇనబింబము, గతరాత్రి ఎముకలు కొరికే చలిపులికి భయపడి ముడుచుకు పోయి బిరుసెక్కిన ప్రాణికోటి అవయవాలు, గూళ్ళ నుండి కిలకిలా రావాలతో ఆహారాన్వేషణలో విహారం వెళ్తున్న పక్షి సమూహాలు చలి నుండి విముక్తి పొందడానికి విఫల ప్రయత్నం చేస్తున్నాయి. వేప పుల్లను పండ్లతో నములుతూ, చేతిలోని పనకోలతో మంచుతో తడిసి ముద్దైన వరిగడ్డిని వడ్లకుప్ప పైనుంచి ఒడుపుగా తొలగిస్తూ వలయాకారంగా వున్న గడ్డి కుప్ప పైకి విసురుతున్నాడు రామయ్య.

ఆ ఊరి మాలవాడలో రామయ్య ఒక సన్నకారు రైతు. భార్య నీలమ్మ, కొడుకు సత్యం. అదొక దిగువ మధ్య తరగతి కుటుంబం. రామయ్యకు పిత్రార్జితంగా సంక్రమించిన అర ఎకరం మరక, అర ఎకరం తరి భార్య సహకారంతో సేద్యం చేస్తూ బతుకు బండిని కష్టమే ఐనా లాఘవంగా లాక్కొస్తున్నాడు. కొడుకు సత్యం కరీంనగర్‌లో హరిజన వసతి గృహంలో వుంటూ ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు.

గత నాలుగు దినాలుగా పొలం కోసింది దరిమిలా నేటి వరకు వరిని ఎడ్లతో బంతి తొక్కించి వడ్లను నూర్పిడి చేశాడు రామయ్య. ఈ దినం వడ్లను తూర్పారా పట్టి ఊరిలోని అంజయ్య షావుకారి 'స్వంత' గిడ్డంగిలోకి తరలించాలి. ఒక చోట నేలను వెంపలి చీపురుతో నున్నగా ఊడ్చి తూర్పారా పట్టడానికి అనుకూలంగా బండిని మోహరించాడు. బావి వద్దకు వెళ్లి ముఖం కాళ్ళు చేతులు కడుక్కొని భార్య రాక కొరకు ఎదురు చూస్తున్నాడు.

"అయ్యా... ఓ అయ్యా! ఎక్కడున్నవే" అంటూ అల్లంత దూరం నుంచి కేకలు విన్పించడంతో, నుదుటిపై ఎడమ చేతిని సూర్య కిరణాలకు అడ్డుగా వుంచి రాజులగుట్ట వైపు దృష్టి సారిస్తూ, "సత్తులు మాట తీరుంది. గీడెప్పు డొచ్చిండు కన్నారం నుంచి" అనుకుంటూ భృకుటి ముడిచి, వెంటనే బండెక్కి సత్యం వస్తున్న వైపు కుడిచేయి ఎత్తిసైగ చేశాడు. "ఇగో... ఇగో గిక్కడున్నా, గిట్రా.. గిట్రా" అంటూ కొడుక్కు తన కళ్ళం వున్న జాగాను సూచించాడు రామయ్య. బుట్టిగుల్లను, చాటను నెత్తిపైమోస్తూ వంపులు తిరిగిన వాగులోని ఇసుక తిన్నెల మీదుగా పరుగెత్తుకుంటూ బిరానవచ్చి తండ్రిని చేరాడు సత్యం.

"ఏంది బిడ్డా! సంకురాత్తిరి కొత్త నన్నోడివి గింతమాఎల్లైమే అచ్చినవ్ ఏమైంది?" అంటూ ఊహకందని కొడుకు రాక గురించి

ఆరాతీశాడు రామయ్య.

"పరీక్ష ఫీసు పది రూపాయలు కట్టేటి దుంది. ఫీసు కట్టకుంటే ఆర్నెల్ల పరీక్షలు రాయనియ్యమని గా సార్లు అన్నరు. గందుకే పైసెలు కొండవోదామని గిప్పుడచ్చిన" అంటూ రొప్పుతూ చెప్పాడు సత్యం.

"మల్ల పరీచ్చ పీసా! గిప్పటికే సావ్ కారి కాడ తెచ్చిన పాతబాకీ లెక్కగట్లనే ఉండె. మల్ల పైసెలని ఊరికచ్చినవా? పండిచ్చిన దినుసంతా సావ్‌కారి ఇంట్లగుమ్మరిచ్చిన గూడా గా మొండి బాకి తీరుతలేదు. గిప్పుడన్నా గోన్నడ్లు మిగులు తయేమో అనుకుంటే పైసెలు పైసెలు అని ఊడి పడితివి. గిట్లైతే మనం మెతుకుల బువ్వ తింటామా గీ జల్మల?" అంటూ తండ్రి పెట్టే ఏకరువు అర్ధమయీ కానట్లు తోచింది సత్యంకు.

"ఏమో గయ్యన్ని సంగతులు నా కెర్కలె గనీ... అవ్వ అచ్చేవరకు ఆలిసెమైతది. సావుకారి కాడ బోరెం అడుక్కోని, సద్ది పట్టుకోని అత్తనన్నది. మనల్ను అడ్లు తూర్పాలవట్టు మన్నది" అంటూ బుట్టిగుల్లలో వడ్లు తోడుకొని బండి ఎక్కాడు సత్యం.

సత్యం వడ్లు దారగా పోస్తుంటే తను చాటందుకొని గాలి విసరడానికి ఉపక్రమించాడు రామయ్య.

కరకర పొద్దు పైకెక్కుతున్న కొద్దీ తూర్పారాపట్టే వడ్లరాశి శిఖరంలా పెరుగు తుంది. అలసట మరిచిపోయిన తండ్రీ కొడుకులు యంత్రాల్లా కదులుతున్నారు. కాని ఇంధనం ఐపోతే యంత్రాలైనా తిరగవు కదా! కడుపులో రైల్లు ఎట్లెట్లా పరుగెడుతుంటే, వాళ్ళ దృష్టి అట్లట్లా రాజుల గుట్టవైపు మరలుతుంది.

ఏనుగంత బోరాన్ని నెత్తిమీద మోస్తూ చంకలో సద్దిమూట పెట్టుకొని వడివడిగా నడి చొచ్చే ఆకారాన్ని గమనించగానే రామయ్య చేతిలోని చాటా, సత్యం చేతిలోని బుట్టిగుల్ల అనంకల్పితంగా కిందపడిపోయాయి. బావికాడి కెళ్ళి కాళ్ళు చేతులు శుభ్రపరచుకొని తిరిగి కళ్ళం కాడికొచ్చేసరికి,భర్తకు కొడుక్కూ సద్ది మూట అందించింది నీలమ్మ. తండ్రీ కొడుకూ భోంచేస్తుండగా ఆమె దూరంగా చిందిన వడ్లను చీపురుతో రాశివైపు ఊడుస్తూ, "సావ్‌కారి అడ్లు తీసుకచ్చి కాపు రాజవ్వ ఇంట్ల పొయ్యిమని సెప్పిండు" అంటూ వివరించింది భర్తతో.

"ఆవ్ మల్ల! గైనింట్ల జాగెక్కడుంది. ఎప్పుడైనే గామె ఇంటికే కద మనం అడ్లయినే, నిరువకాయెలైనే జారగొట్టేది'' అన్నాడు రామయ్య.

కాపు రాజవ్వ వితంతువు. ఉన్న ఒక్క కొడుకు చదువుల సాకుతో పట్టణాలకే పరిమితమయ్యాడు. లంకంత ఇల్లు. చెప్పుకో దగ్గ ఆస్తి.పాలేర్లను పెట్టి వ్యవసాయం చేయిస్తూ అంజయ్య షావుకారి రాజరికంలో, ఈమె రాణీ వాసం వెలగబెడుతుంది. ఈ తంతు ఊరికంతా తెలిసిందే.కాని షావుకారి మాటకారి తనం, ధనం చూసి ఎవ్వరూ నోరు మెదపరు. షావు కారి చమత్కారం చూసి అందరూ నమస్కారం చేస్తారే కాని విమర్శించరు. దేనికదే చెప్పు కోవాలి ఈ ఒక్క తప్పిదం మినహా గుణంలో రాజవ్వ జాతిరత్నమే.

తల్లి తండ్రి వడ్లు తూర్పారా పడు తుంటే సత్యంకు తీరిక దొరికింది. కాలహరణం కొరకు ఒర్రెలోకి దిగి చెలమ తోడి తెల్లని స్వచ్ఛమైన నీళ్ళు సృష్టించి తాగి ఆనంద పడ్డాడు. ఒర్రెకు రెండు వైపులా ఏపుగా పెరిగిన సూల చొప్ప నుండి ఎండిన గొట్టాలను కొడవలితో కోసి పిల్లంగ్రోవి తయారుచేసి ఊదుకుంటూ చెరువు దగ్గరికి చేరాడు. పుష్కలమైన ఆ నీటిలో ఈదులాడుతూ తనివితీరా స్నానం చేశాడు. వస్తూ వస్తూ వాగులో ఒక చోట చేపపిల్లలు జాస్తీగా కనబడితే, నీళ్ళకు మాటువేసి మడుగు లోని నీళ్ళను బైటికి చల్లి చేపలు పట్టాడు. వాటిని కడిగి బొమ్మెడాకుల డొప్పలో భద్ర పరచుకొని కళ్ళం దగ్గరి కొచ్చేసరికి అమ్మా నాన్నలు వడ్లను బండిలో నింపి మోకు తాడుతో బోరాన్ని బిగిస్తున్నారు. అప్పటికి పొద్దు పడమటి గుట్టల అంచులపై జీరాడుతుంది.

రామయ్య బండి నడుపుతుంటే నీలమ్మ ఒకవైపు, సత్యం ఒకవైపు బండి చక్రాలకు ఆసరా పడుతున్నారు. పొలంలోంచి బండి ఒర్రెలోకి దిగింది. మేట వేసి ఉన్న ఇసుకలో బర్రీతో నడుస్తున్న కచ్చులపు గీరెలు లోనికంటా దిగబడి పోతున్నాయి. బండిని లాగడానికి ఎద్లు నానా తంటాలు పడుతున్నాయి. రెండు జీవాలతో సమానంగా మిగతా మూడు ప్రాణాలు బండిని ముందుకు కదలించడానికి సర్వశక్తులు ఒడ్డి పోరాడుతున్నాయి. అంగుళాల చొప్పున బండి ముందుకు కదులుతోంది. భార్యకు కొడుక్కు సూచనలిస్తూ ఎడ్లను ఇష్టమొచ్చిన రీతి తూల నాడుతున్నాడు. ముల్లుకర్రతో కసకసా పొడుస్తు న్నాడు. ఆ పొడిచిన గాయాల నుండి రక్తాలు కారతుంటే ఇదంతా మాకు మామూలే అన్న ట్లుంది ఎడ్ల వాలకం. మూగజీవాలు కదా అంతకు మించి ఇంకేం చేయగలవు.

కష్టంతో పోలిస్తే రామయ్యదీ ఎద్దుల వలె మొద్దు బతుకే. కాకుంటే ఎద్దులు వాటి బాధను ఇతరులతో వ్యక్తం చేయలేవు. రామయ్య తన బాధను ఇతరులతో చెప్పుకున్నా ప్రయోజనం వుండదు.

బండి పట్టుమని పది గజాలు నడవనే లేదు అప్పుడే ఇరుసుకు వేసిన కందెన అరిగి పోయి కిర్రు కిర్రుమనే శబ్దాలు వెలువడి వాళ్ళ మనసుల్లో దడ పుట్టిస్తున్నాయి. ఇంకో మైలు దూరం ప్రయాణిస్తేగాని గట్టినేలరాదు. అప్పటికే చర్మం ఒలిచిన ఎముకలా తయారయ్యింది ఇరుసు పరిస్థితి.దారి సమతలంగా లేదు.కాబట్టి కుడివైపు నేల ఎత్తుగా వున్నప్పుడు ఎడమవైపుకు, ఆ వైపుకు ఎత్తుగా వున్నప్పుడు ఈ వైపుకు కచ్చులం ఒరిగిపోతుంది.అలా ఒరిగినప్పుడు బండి బోల్తా పడకుండా ఉంచడానికి ఏ ప్రక్కన వున్న వాళ్ళు ఆ ప్రక్క వెనుక నొగపై అమాం తం ఎక్కి కాళ్ళతో తొక్కి అదిమి పట్టాలి.

ఆ రెండు ఎడ్లలో ఒకటి పుల్లది. ఒకటి పయ్యది. పుల్లది బరోసాగల ఎద్దు. ఎంత బరు వైనా అవలీలగా లాగేస్తుంది. ఎత్తు గడ్డ ఎక్కాల్సి వస్తే బండిని అలక్ష్యంగా ఇగ్గేస్తుంది. దాని మెడపై కాడి ఎప్పుడు ముందుకే వుంటుంది. ఎటొచ్చి పయ్యదానితోనే ఉన్న చిక్కులన్నీ. చిన్న రాయి అడ్డ తగలగానే అంబా అంటూ కిందపడిపోయి హాయిగా పడకేస్తుంది. దాన్ని లేవదీయడానికి రామయ్య యము డౌతాడు. అక్కడో చిన్నపాటి నరకాన్ని సృష్టిస్తే గాని అది లెవ్వదు. ముల్లుగర్రతో పక్కల్ల పొడుస్తాడు.

కర్రతో ముక్కు మీద బాదుతాడు. ఐనా అది లెవ్వదు. చివరి ప్రయత్నంగా దాని తోకమట్టను గట్టిగా కొరుకుతాడు. అప్పుడు చటుక్కున లేస్తుంది. అదే తంతు ఇప్పుడు కూడా జరుగ బోతోంది. ప్రాథమిక చికిత్సకు ముందు కాస్త జాలి ప్రదర్శిస్తాడు రామయ్య. అందుకే బండి దిగి ముందుకెళ్ళి ఎద్దు మెడపై ఉన్న కాడిని విప్పాడు. అంతే ఊహాతీతంగా దిగ్గున లేచి పరుగు లంకించుకుంది ఆ ఎద్దు. కాని ఎంత దూరం వెళ్తుంది? పుల్ల దానితో పగ్గము లింకు పెట్టబడి వుంది కదా! ఈ తంతు ఇంత తొందరగా తెమిలి నందుకు మనసు కాస్త తేలిక పడింది వాళ్ళకు. కాని ముమ్ముందు ఏం జరుగు తుందో అనే ఆందోళన వుండనే వుంది.

ఎద్దును సెరికి తెచ్చి బండి కట్టి ఈసారి పగ్గాలు పట్టుకొని ముందు నడుస్తున్నాడు రామయ్య. అప్పటి దాకా గట్టిగా పేడవేసిన పయ్యది లూజ్ మోషన్స్ సమస్యతో పుర్రు కొట్టుకోవడం మొదలు పెట్టింది. అలా కారిన పేడ కొంకుల మీదుగా కిందికి జారుతుంటే తోక శలిని పుర్రులో ముంచి చుట్టూ వున్న వాళ్ళని పేడతో అభిషేకిస్తుంది. ఇలాంటి సందర్భంలో అది పడుకొని లేవనని మొరా యించినప్పుడు, దాని తోక కొరకడం మహా ఇబ్బందిగా వుంటుంది రామయ్యకు.

శస్త్రచికిత్స అయిన బాలింతలా నాజూకు గా నడుస్తుంది బండి. ఇరుసు మాత్రం గాన కచ్చేరి నిరంత రాయంగా కొనసాగిస్తూనే వుంది. అప్పుడప్పుడు బండి ప్రవహించే నీళ్ళలో కూడా నడవాల్సి వస్తుంది. అలా నీళ్ళలో దిగినప్పుడు ఇరుసుపై నీళ్ళు చల్లడం పరిపాటి. అయినా గొంతు తడుపుకొని గాత్రాన్ని పునరుద్ధరించి పాడే విద్వాంసుడిలా ఆ ఇరుసు కాంభోజీ రాగంలో ఆలాపన గావిస్తూనే వుంది.

నీళ్ళు కనిపించిన ప్రతిసారి పయ్య ఎద్దుకు తీరని దాహవేస్తుంది. సరేలెమ్మని రామయ్య కనికరం చూపితే మూతి నీళ్ళలో ముంచుకొని తాగినట్టు నటిస్తుంది తప్పా ఎంతకూ తీయదు. అలా కాసేపు బడలిక తీర్చుకోవచ్చనే దాని ఉద్దేశం. బండివెనకాల నడుస్తున్న సత్యంకు కొత్త కావొచ్చు దాని నటన. కాని వాటితో పాటు బతుకు బండిని లాగుతున్న రామయ్యకు కొత్త కాదుగా! అందుకే ముల్లుగర్ర కున్న తోలు వారుతో చటీల్‌మని ఝళిపించాడు దాని మూతిమీద, అంతే ఒక్క కుదుపుతో బండి ముందుకు కదిలింది.

చీకట్లు కమ్ముకుంటున్న సమయానికి బండి వాగుదాటి రాజుల గుట్ట దడెపొంటి వెళ్తుంది. ఆ బాటంతా గులకరాళ్ళమయం. పగటి పూటైతే గాడెంలోని రాళ్ళను ఏరి పడేస్తూ నడిచేవాడు రామయ్య. చీకట్లో పగ్గాలు చేత పట్టుకొని ముల్లుకర్ర నీలమ్మకు ఇచ్చి బండి ముందు నడుస్తున్నాడు రామయ్య. గుట్టదాటి ఊరిలోకి చేరితే కష్టాలన్నీ గట్టెక్కినట్లే. ఏ రాయి బండి గీరెకు అడ్డు తగలొద్దని మనసులోనే దేవుళ్ళను ప్రార్థిస్తుంది నీలమ్మ ముఖ్యంగా పయ్య ఎద్దువైపు. ఇప్పుడది పడుకునే కార్యక్రమం మొదలెడితే ఇక నిజంగా తెల్లారినట్లే. వడ్లను క్షేమంగా షావుకారికి అప్పజెప్పాలె. లెక్క చూసుకొని పిల్లగానికి రూపాయలు ఇప్పించాలె. ఇదంతా ఈ రాత్రికే జరుగాల్సిన వ్యవహారం అందుకే అంతా ఊపిరి బిగబట్టి నడుస్తున్నారు.

బండి మూల మలుపు తిరుగుతుంది. ఊరిలోని గుడిసెల్లో గుడ్డి దీపాలు మినుకు మినుకు మంటూ దర్శనమిస్తున్నాయి. అల్లంత దూరాన మనుషుల అలికిడి వినబడుతోంది. హమ్మయ్య అనుకునే తరుణం ఆసన్నమైంది. పుల్ల ఎద్దు వడివడిగా అడుగులు వేస్తుంది. బండి అలా మలుపు తిరుగుతున్న సమయంలో దాని వైపు చక్రం కిందకు ఒక లావాటి రాయి రావడం, ఆ రాయిని చక్రం విసురుగా ఎక్కడం, అమాంతం బండి పయ్య ఎద్దువైపు ఒరిగి బోల్తా పడటం క్షణాల్లో జరిగిపోయింది. "అయ్యో... అయ్యో..."అనే అరుపులు ఆ ముగ్గురి నోళ్ళ నుంచి ఒకేసారి వెలువడి పరిసరాలుప్రతిధ్వనిం చాయి. ఛాయా మాత్రంగా ఘోచరమయ్యే ఆ చీకట్లో రామయ్యకు ఏం చేయాలో పాలు పోలేదు. కండ్లు చిట్లించుకొని చూస్తే పుల్ల ఎద్దు వైపు ఉన్న కాడి కొస పైకి లేచి దాని మెడకు ఉన్న జనుపదొత్తె ఉరిపెట్టినట్లు బిగుసుకుంది. ఆ సంకట స్థితిలో అది పడుతున్న వేదన చీకట్లో కలిసిపోయింది.పరిస్థితిని సమీక్షించిన రామయ్య వెంటనే కుప్పించి పైకి ఎగిరి కాడి రంధ్రానికి వున్న కనాన్ని నైపుణ్యంగా ఊడ బెరికాడు. ఎద్దు గంగడోలును ఆప్యాయంగా నిమురుతుంటే భార్యా కొడుకు బిత్తరపోయి చూస్తున్నారు. బండి బోల్తా కొట్టినందుకు చింతించాలా, ఎద్దును రక్షించు కున్నందుకు గర్వపడాలా తేల్చుకోలేని సందిగ్ధా వస్థలో పడిపోయాడు రామయ్య.

కథ మళ్ళీ మొదటికొచ్చింది. వడ్ల బర్తీతో ఉన్న బండిని అమాంతం లేపడం సాధ్యమయ్యే పనిగాదు. వడ్లు మొత్తం తోడి పక్కకు పోయాలి. అప్పుడు మళ్ళీ బోరెం బండిలో వేసి తిరిగి వడ్లన్నీ నింపాలి. ఎంత లేదన్నా రెండు మూడు గంటల పని. చిక్కటి చీకటి. నేలంతా రాళ్ళు, దుబ్బ, చెత్త. ఏడవ దానికి కూడా సమయంలేని బతుకులు. ఎటూ తెమలని దైన్య స్థితి. ఎవరి కాళ్ళు మొక్కియైనా, ఎంత రాత్రి ఐనా ధాన్యాన్ని ఇక్కన్నుంచి షావు కారి గాదెకు తరలించాల్సిందే. అందుకే సత్యం ను బండి వద్ద ఉంచి భార్యా భర్తలిద్దరు ఊరిపై పడ్డారు.

షావుకారి ఇంటికి వెళ్ళి విషయం చెప్పి, షావుకారవ్వతో నానా చివాట్లు తిని రామయ్య కందిల అడిగి తెచ్చేసరికి, నీలమ్మ ఇంట్లో వున్న చెద్దర్లు వగైరా పాత బట్టలన్నీ నెత్తిన పడేసుకుని కచ్చులం కాడి కొచ్చింది. కందిల వెలుతురులో బట్టలు పరిచి వడ్లు బోరెంనుండి తోడుతుండగా విషయం తెలిసిన కొందరు వాడకట్టు వాళ్ళు వచ్చి సాయం చేశారు. ఎలాగైతేనేమి రాత్రి పది అయ్యేసరికి బండి మళ్ళీ కదిలింది.

రామయ్య ఎడ్లబండిని కాపు రాజవ్వ ఇంటి ముందు ఆపి "రాజవ్వా... రాజవ్వా..." అంటూ పిలువగానే మేల్కొని వచ్చి తలుపు తెరిచింది ఆమె అంత చలిలో. రాజవ్వ మనసు నవనీతం లాంటిది. ఎప్పుడు ఎవ్వరిని కసురు కొని ఎరుగదు. షావుకారవ్వకు ఈమెకు జమీన్ ఆస్మాన్ ఫరాఖ్.

"ఏందే రామన్నా! గింత రాత్తిరైంది? సావుకారి సెప్పిండు నువ్వు అడ్లు తెత్తవని. గీవార్ధాక ఎదిరి సూసి, ఇగ నువ్వు రావేమో అనుకొని గిప్పుడే ఒరిగిన. కన్నంటుకున్నది" అంటూ రామయ్యను గుర్తించి చేతిలోని చిమ్ని వత్తిని కాస్త పైకి తిప్పింది.

"ఏం జెప్పుమంటవక్కా మా కట్టం. కచ్చులం బోర్రవడి గింత ఆలిసెపైంది. నువ్వు తలుపు దీత్తవో తియ్యవో అని భయంతోటి జచ్చిన. నీ కడుపు సల్లగుండ. ఒక్క పిలుపుకే తలుపు దీసినవ్" అంటూ ఆమెను శ్లాఘించాడు రామయ్య.

"అయ్యో! ఏందే అన్నా గట్లంటవ్? మీరు గీడ సల్లె అనుకుతుంటే నేను లోపట సెద్దరు గప్పుకొని పరాకతుగ పంతనను కున్నవా? నేన్గూడ మనిషినేనే. గంత పాపపు దాన్ని గాను" అంటూ మానవత్వాన్ని పరిమళింపజేసింది రాజవ్వ ఇంట్లోనుంచి రెండుఅంచెలు తీసుకొస్తు.

"నీ అసోంటోల్లను జూత్తే కాల్లకు మొక్కాలని అనిపిత్తది అక్కా?! కొందరు పున్నె గంగలను జూత్తే అగ్గివెట్ట బుద్ధైతది" అంటూ మనసులో షావుకారవ్వను తలుచుకుంటూ ఆమె ఇచ్చిన అంచెలను తీసుకున్నాడు రామయ్య.

గోంత ముందుగాల అత్తె మల్లయ్య ఆసర వట్టేటోడు. గింత రాత్తిరి అత్తిరి ఎట్ల" అంటూ రాజవ్వ కూడా ఒక అంచెను మోసు కొచ్చి ఇంట్లో ఒక మూలకు పోసింది. నీలమ్మ, సత్యం బండిలో నుండి వడ్లు తోడి అందిస్తుంటే రామయ్య, రాజవ్వ అరగంటలోనే మొత్తం వడ్లు ఇంట్లో పోశారు.

భార్యను, కొడుకును ఇంటికి పంపి, తాను షావుకారింటికెళ్ళి లెక్క చూసుకొని డబ్బులు తెస్తానని బయలుదేరబోయాడు రామయ్య.

"గింత రాత్తిరి నువ్వు గాల్లింటికి వోతే గాల్లు లెవ్వరు. ఒగాల్ల లేసినా నీ లెక్క జూడదు సావుకారి. కావోతే గా కందిల అప్పజెప్పి, ఇంటికి వో"అంటూ సలహా యిచ్చింది రాజవ్వ.

"ఎంత నాత్తిరైనే మంచిదే, ఎన్ని తిట్లు దిన్న మంచిదే. గీ పోరదు రేపొద్దుగాల పట్ట్ బసుకే కన్నారం పోతడట. గందుకే పైసెల కొరకన్నా వోయి సావాలె" అంటూ "అవసరానికి గాడిద కాళ్ళు అయినా పట్టుకోక తప్పదు" అని మనసులోనే తలుస్తూ చెప్పాడు రామయ్య.

"అబ్బో! ఇంక పైసెలు గూద అడుగు తాననుకుంటున్నవా! గింత రాత్తిరి నీకు గాల్లు పైసలు పువ్వల్ల పెట్టి ఇత్తరనుకుంటున్నావా? దీపాలు ముట్టిచ్చినంక 'లచ్చిమిని' లోపటికి తీసుకునుడే గాని బయటికి ఎల్లనిత్తరా గా కొమాట్లు?"అంటూ అది ఎంత మాత్రం జరిగే పని కాదని సూచించింది రాజవ్వ.

"మరెట్లక్కా! నేనేం జేత్తూ" అంటూ దిగాలుగా చతికిలపడిపోయాడు రామయ్య.

"ఇగో గీ పది రూపాయలు తీసుకొని పిలగాన్నైతే బడికి తోలు" అంటూ ఇంట్లో కెళ్ళి పది రూపాయల నోటు తెచ్చి రామయ్య కిచ్చింది రాజవ్వ.

ఆమె దాతృత్వానికి నివ్వెరపోయాడు రామయ్య. డబ్బులు తీసుకోడానికి తటపటా యించాడు. చొరవగా ఆమె నోటును అతని చేతిలో పెట్టగానే పులకించిపోయాడు. డబ్బులు తీసుకొని చక్కా ఇంటికి వెళ్ళాలనుకున్నాడు. కాని కందిల ఈ రాత్రికే ఇంటికి చేరకుంటే షావు కారవ్వ తాటకిలా చిందులు వేస్తుందని యోచించి బండిని షావుకారి ఇంటివైపు నడి పించాడు రామయ్య.

బండి దిగి పెద్దరువాజ ముందు నిల్చొని మొగమాట పడ్డాడు రామయ్య. కాపు రాజవ్వను పిలువ డానికి ఎలాంటి బెదరు ప్రదర్శించని రామయ్య వీళ్ళను పిలవడానికి జంకుతున్నాడు.

"సావ్ కారీ.... సావ్కారీ..." అంటూ భయంభయంగా పిలిచి వెనుకెనుకకు అడు గేశాడు రామయ్య. లోపలి నుండి ఎలాంటి అలికిడి వినిపించక పోయేసరికి తిరిగి ధైర్యాన్ని కూడదీసుకొని తలుపు మీద చేతితో కొడుతూ "సావ్కారవ్వ... సావ్కారవ్వ" అంటూ దఫదఫా లుగా అరిచాడు.

"నీ ఇంట్ల పీనుగెల్ల ఎవ్వనివిరా! గింత నాత్తిరచ్చి తలుపుమీద ఇయ్యరమయ్యర గొడు తున్నవ్! అయ్యిరుగుతే నీ యయ్య జేపిత్తదను కుంటున్నవా? ఆల్ల లేదు పాల్ల లేదు కొంచెపు గాడిది కొడుకులకు.ఎప్పుడంటప్పుడు సంతింటి కచ్చినట్టత్తరు. ఇక్కడ అయ్య సొమ్ము అవ్వ సొమ్ము దాస వెట్టింద్రట" అంటూ శాపనార్థాలు పెడుతూ పర్వతంలా వచ్చి తలుపు తెరిచింది షాపుకారవ్వ.

"కందిల ఇచ్చి పోతనని అచ్చిన గంతే. గీ కందిల లోపట వెట్టుకో.... అవ్వా" అంటూ తలుపు తెరుచుకోగానే చేయిసాచి కందిల లోపట పెట్టాడు రామయ్య. చేతికిస్తే తీసుకోదని తెల్సు. ఎంత తొందరగా తెమిలితే అంత మంచి దని మనసు పీకుతుంది రామయ్యకు. ఇక్క దున్నంతసేపు కంది రీగల తోటి కుట్టించుకున్న ట్లుంటుంది.

"పెట్టుకుంట... పెట్టుకుంట. ఉన్న సవం రంత ఒడగొట్టి ఉత్త బుర్ర దెచ్చినవుకద ఇంకేంది! పెట్టుకోకపోతే సత్తనా! బారనకు సేరు గొంచు నూనె. పావుసేరు నూనుండె. బొత్తిలకు అగ్గిదలుగ వెట్టినవ్ గద! ఎవ్వడిత్తడు పైసెలు. అవ్వ మొగడిత్తడా?" అంటూ ఆమె దండకం సాగదీస్తుంటే ఏమని స్పందించాలో తెలియక...

"సావ్కారి పన్నడా అవ్వా..." అంటూ అన్యాపదేశంగా అడిగాడు రామయ్య.

"పండలే... నువ్వు అరాల మూట తెత్తవని నీ కోసమే ఎదిరి సూత్తుండు" అంటూ అవహేళన చేసింది షావుకారవ్వ.

"నేపొద్దుగాలచ్చి సావ్కారిని కలుత్త" అంటూ బండెక్కి బయలుదేరుతుంటే "అత్తవ్... అత్తవ్! ఇగరావా? పుట్టు దెచ్చి గుమ్మరిచ్చి నవేమో" ఆమె వెటకారపుమాటల ప్రకంపనలు వెనుకనుంచి తరుముతుంటే ఎడ్ల తోకలు పట్టి ఒకటే పరుగెత్తించాడు బండిని రామయ్య.

☆ ☆ ☆

"అవ్వా! గోంత గంజి అంచుతవా?కొత్తడ్ల గంజి తాగబుద్ధయితంది" అంటూ వంటకు ఉపక్రమిస్తున్న తల్లిని అభ్యర్థించాడు సత్యం.

"అయ్యో బిడ్డా ! అడ్లెక్కడ ఇంటికచ్చి నయి. గియ్యల్లనే కదా కొడుకా అడ్లు దెచ్చి సావ్కారికి పోసినం. రేపు కళ్లమంత ఊడిసి, మనిగండ్లు జెరిగి... ఇర్సన్ని ఐతయి గావచ్చు. రేపు మాపటీలి తెచ్చి దంచి కొత్తబియ్యం తోటి గంజంచుత, రేపుండి తాగి ఎల్లుండి పొద్దుగాల పో బిడ్డా" అంటూ కొడుకు ఇంతగనం అడిగిన కోరికను తీర్చకపోతినే అనే బాధను హృదయం నిండా నింపుకొంది నీలమ్మ.

"అబ్బ అద్దే అవ్వా! రేపేవోతా! పరీక్ష ఫీసు కట్టకుంటే సార్లు కొడతరు. సంకురాత్రి సెలవల కత్త గద! గప్పుడు దాగుతలే!" అంటూ తన కోరికను మనసు పొరల్లో నిక్షిప్తం చేసుకొని

తండ్రి రాకకొరకు ఎదిరి చూస్తున్నాడు సత్యం.

నీలమ్మ గటుక రుద్ది ఉమ్మగిల్లడానికి కుండమూతిపై చిప్ప బోర్లించింది. భర్త ఇంటికి రాగానే పచ్చిమిరపకాయలు ఉడికించి నూరిన కారంతో అన్నం వడ్డించింది. సత్యం వాగులో పట్టిన చేపలు బండి బోల్తా పడ్డప్పుడు ఎక్కడ చిల్లి పడ్డాయో ఎవరికీ తెలియదు.

కొడుక్కు పదిరూపాయల నోటుతో పాటు బస్సు ఛార్జీల కొరకు కాస్త చిల్లర నాణాలు కూడా ఇచ్చాడు రామయ్య. ఏదో కాస్త ఎంగిలి పడ్డాం అనిపించుకొని పక్కలు వాల్చారు. అప్పటికి రాత్రి పన్నెండు దాటింది.

ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన పంట ఇలా అనివార్యమైన దోపిడీకి గురికావడంతో, పసిబిడ్డ అర్థించిన గంజి మెతుకులు కూడా పోయలేని తమ దౌర్భాగ్యపు స్థితిని తలుచుకొని మూగగా రోధించింది. భర్త గమనించకుండా నీలమ్మ.

షావుకారి చూపబోయే లెక్కల పద్దు ఎంతలా పెరిగి కూచుంటుందో తలుచుకుంటూ మగత నిద్రలో జోగాడు రామయ్య.

తెల్లారగానే పరుగో పరుగంటూ బస్టాపు వైపు వెళ్ళాడు సత్యం. బండికి కందెన వేసే కార్యక్రమంలో మునిగిపోయాడు రామయ్య. ఇంటి ప్రాంగణంలో అలుకు పూత చేస్తూ తలమునకలయ్యింది నీలమ్మ. ఇద్దరి పనులు తెమిలేసరికి అంబటాల్ల అయ్యింది. ముఖం కడుక్కొని షావుకారింటికెళ్ళాడు రామయ్య.

పూజా పునస్కారాలు ముగించుకొని వచ్చి దుకాణంలో కూర్చున్నాడు అంజయ్య షావుకారి. దేవుని ఫొటోను అగరుబత్తుల దూపం మేఘంలా కమ్మేస్తుంది. ఆ పొగ రామయ్య ముక్కు పుటాలకు సోకగానే సహజత్వం కోల్పోయి దూడూ బసవన్నలా దేనికంటే దానికి తల ఆడించేస్థాయికి దిగజారిపోయాడు.

ఖాతా పుస్తకం ముందేసుకుని పేజీలు అటూ ఇటూ తిప్పి రామయ్య అకౌంటు తెరిచాడు షావుకారి. బట్టలకు, వెచ్చాలకు అయిన ఖర్చుతో సహా అప్పుడప్పుడు తీసుకున్న చిల్లర డబ్బులు కూడి మూడువందల రూపాయల మొత్తానికి లాగాడు. ఈ గారడీ అంతా పరిశీలనగా చూసేచొరవా, ఉద్దేశంలేని రామయ్య ఖర్చులన్ని పోను ఈ పంటకు మిగిలే దేవైనా ఉందా అన్నట్లు చూశాడు. కాని షావుకారి తన ఖాతాకు, రామయ్య పంటకు సున్నకు సున్న... హల్లికి హల్లి లెక్క చూపేసరికి ఒక సుదీర్ఘమైన నిట్టూర్పు మాత్రం మిగిలింది రామయ్యకు. చేయ గలిగిందేమీ లేక కొత్తగా ఖాతా తెరిపించి పది రూపాయలు అడుక్కొని పోయి కాపు రాజవ్వకు చెల్లించాడు. ముఖాన్ని రుమాలుతో దాచుకొని ఇంటివైపు కదిలాడు నిర్లిప్త భావంతో రామయ్య.

"పోయిన పనేమైంది. లెక్క సరింగ జూసుకున్నవా? ఏమన్నా పైసెలు మనకు ముదుర తేలిందా లేదా!" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది నీలమ్మ భర్త వాలకం గమనించి.

"పైసలు లెవ్వు గియిసెలు లెవ్వు! ఎప్పుడన్నా అచ్చినయా? గిప్పుడు కొత్తగ అచ్చుటానికి?" అంటూ మనసులోని కోపాన్ని రుమాలుపై చూపిస్తూ మంచంపై విసురుగా గిరాటేశాడు రామయ్య.

"ఏందీ! పదిగిద్దెలడ్లకు పైసె కూడ మిగులలేద? అసలు నువ్వు లెక్క సక్కగ సదివి ఇనిపిచ్చుకున్నవా లేపోతే బొడ్రాయి లెక్క సప్పుడింట కూసున్నవా?" అంటూ భర్తను నిష్ఠూరాలాడింది నీలమ్మ.

"ఏందే! బగ్గ మాట్లాడుతున్నవ్ నేనొక్కన్నే లెక్క సక్కగ జూసుకుంటలేనా? మనాడకట్టు పోషన్న, రాజన్న, ఎల్లన్న, కొంరన్న గీల్లందరు ఆల్లకు వండిన దినుసంతా సావ్ కారికి వొత్తలేరా? మనదో లెక్క ఆల్లదో లెక్కనా?" అంటూ షావుకారిమీది కోపాన్ని భార్య మీద ప్రదర్శించాడు రామయ్య.

ఏడుస్తూ, సీదుతూ అలాగాలిలో శాప నార్థాలు పెడుతూ, ఏమీ చేయలేని వాళ్ళ చేతకాని తనాన్ని ఈసడించుకొంటూ భర్తకు అన్నం వడ్డించి, తనూ కాస్త ఎంగిలిపడి పొలం వైపు బయలుదేరింది నీలమ్మ. అన్నం తిని బండికట్టుకుని తనూ బయలుదేరాడు రామయ్య.

☆ ☆ ☆

"గియ్యేడన్నా ఒక ఎకురం పొలం కొంటరా లేదా! యాటా పోరు పెడుతున్నా నా మాట కాతరు జేత్తలేపోతిరి" అంటూ అంజయ్య షావుకారిని నిలదీసింది ఆయన భార్య.

"పొలం కొంటే దాంతోటి ఎవ్వడు తంటాలు పడాలమ్మా? అట్టిగనే పండుతదా పంట? ఇటు దుకాణం యాడ నడిపిత్తూ, అటు ఎవుసం యాడసేపిత్తూ" అంటూ సేద్యం కన్నా వ్యాపారంలోనే లాభం ఎక్కువ అనే నిజాన్ని వివరించే ప్రయత్నం చేశాడు అంజయ్య షావుకారి.

"మీరెన్నైనా జెప్పుండ్రి...గా నవనీత రావు దొర పాలేర్లను వెట్టి గన్నెకురాలు పండిత్త లేడా? గయినె బగ్గకట్ట జెత్తుండ! అంత పాలేర్లే సెయ్యవట్టిరి" అంటూ ఈ సంవత్సరం ఎలాగైనా పొలం కొనిపించాలనే పట్టుదలతో భర్తను కట్టడి చేసింది షావుకారవ్వ.

"భూమి కొని ఎవుసం జేపిత్తే గండ్లే ముంటది. నవనీతరావు దొర పది ఎకరాల పొలం దున్నియ్యటానికి పదిమంది పాలేర్లను వెట్టి ఎవుసం జేపిస్తే ఆల్లకు మనిషికి ఇద్దుమో ముత్తుమో అడ్లు పోసేవట్టే. గా దొరకంటే మన పని నయెం గద. భూమి లేకుంటనే, పాలేర్లను వెట్టకుంటనే యాదాదికి గైనకంటే మనకే ఎక్కో అడ్లు రావట్టే. సూత్తలేవా? అంతగొడితే గీల్లకు మనం యిచ్చే సామాను ఒక గిద్దెడు అడ్లకు సమానం. పదిగిద్దెల అడ్లల్ల కేల్లి ఒక గిద్దెడు అడ్లు వోతే తొమ్మిది గిద్దెలు మనకు లాభమే గద! ఇంతకంటే పూసగుచ్చినట్టు జెప్పాల్నా నీకు. తెలువది మొత్తుకోదు. అట్టిమట్టి బుర్ర. ఒర్రుదు దప్ప ఇంకో ఆలోచన లేదు. ఇంకెప్పుడు గిసోంటి పిసపిస మాటలు మాట్లాడకు" అంటూ తన కౌటిల్యాన్ని వివరించి చెప్పి భార్య నోరు మూయించాడు అంజయ్య షావుకారి.


## విజ్ఞప్తి

చినుకు మీకు నచ్చితే మీ మిత్రులను చందా దారులుగా చేర్పించండి